మావుళ్లమ్మ అన్నసమారాధన

- 60 వేలకుపైగా భక్తులు ప్రసాదం స్వీకరణ
- మహాకుంభానికి ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు దంపతుల పూజలు
- వేలంలో రూ.1.10 లక్షలు పలికిన 36 కేజీల లడ్డూ



భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో మహా నైవేద్యం



లడ్డూ రూ.1.10 లక్షలు

మావుళ్లమ్మ వారి 36 కేజీల లడ్డూను వేలంపాట నిర్వహించగా పట్టణానికి చెందిన పడమటి రామకృష్ణ రూ.1.10 లక్షలకు దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు లడ్డూను అందించి అభినందనలు తెలిపారు.

భీమవరం టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మావుళ్లమ్మ ఆలయ 61వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారి విగ్రహానికి ఎదురుగా ఉంచిన మహాకుంభానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు దంపతులు పూజలు చేశారు. మహాకుంభానికి నివేదన చేసి హారతి ఇచ్చిన తర్వాత సమారాధనను ప్రారంభించారు. భక్తులు అందించిన బూరెలు, గారెలు, పలురకాల స్వీట్లు, చనివిడి పానకాలు మహాకుంభంపై ఉంచారు. దాదాపు 60 వేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించేందుకు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. మూడు గంటల వరకు రద్దీ కొనసాగింది. జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చనమల చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు, ఎం.నారాయణమ్మ, పి.బాపిరాజు, సంఘ సభ్యులు ఉన్నారు.

భారీ బందోబస్తు

ఆలయ పరిసర ప్రాంతాల్లో డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బఫే విధానంలోను, మరోచోట సిట్టింగ్‌లోను భక్తులకు ప్రసాదాన్ని కమిటీ సభ్యులు అందించారు. క్యూలైన్‌లో వున్న వారికి మావుళ్లమ్మ యూత్ సభ్యులు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందించారు.



స్వచ్ఛాంధ్రలో వెనుకబాటు

15వ స్థానంలో నిలిచిన ఏలూరు జిల్లా

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో జిల్లా 15వ స్థానంతో సరిపెట్టుకుంది. పరిశుభ్రత, స్వచ్ఛమైన గాలి, నీరు, ప్లాస్టిక్ నివారణ వంటి 14 అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అమలు చేస్తున్న కార్యాచరణ ఆధారంగా వచ్చిన పాయింట్ల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు లభించాయి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం నిర్వహించిన సమీక్షలో స్వచ్ఛాంధ్రలో లభించిన మార్కుల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ప్రకటించారు. మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇవ్వగా ఏలూరు జిల్లా 108 పాయింట్లు సాధించి రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్లు, డోర్ టూ డోర్ కలెక్షన్, సాలిడ్ వేస్ట్ శాగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, క్లీన్‌విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిని పరిగణలోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహిస్తున్నారు. జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడులో ఫుడ్‌పార్క్

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో త్వరలో ఫుడ్‌పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బూత్‌క్లస్టర్, యూనిట్ కమిటీ సభ్యులతో ఆయన శుక్రవారం నూజివీడులోని పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే రూ.ఆరు లక్షల కోట్ల పెట్టుబడులను, ఎంవోయూలను కుదుర్చుకున్నట్టు తెలిపారు. గుంటూరు - కృష్ణా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మంత్రి పార్టీ శ్రేణులను ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ అబ్జర్వర్ మల్లెల రాజశేఖర్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్ పాల్గొన్నారు.



హోరా హోరీ..!

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అభ్యర్థులు హోరాహోరీగా ఢీకొనబోతున్నారు. గతంలో ఇదే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 37 మంది మధ్య పోటీ జరగ్గా, ఇప్పుడు ఆ సంఖ్య 35కు తగ్గింది. గతంలో టీడీపీ బలపర్చిన అభ్యర్థి లేకపోగా, ఇప్పుడు ఆ పార్టీయే ప్రత్యక్షంగా రాజశేఖరంను అభ్యర్థిగా రంగంలోకి దింపింది. పీడీఎఫ్ పక్షాన దిడ్ల వీరరాఘవులు రంగంలో ఢీకొంటున్నారు. నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసినప్పటికీ, గడిచిన 45 రోజులుగా ప్రచారాన్ని వీలైనంత మేర కొనసాగిస్తూనే ఉన్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- బరిలో 35 మంది.. పెరిగిన ప్రచార వేడి
- 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు
- కూటమి అభ్యర్థిగా రాజశేఖరం..
- అన్ని చోట్ల టీడీపీ మోహరింపు.. మద్దతుగా జనసేన, బీజేపీ దీటైన ప్రచారం
- పీడీఎఫ్ నుంచి వీర రాఘవులు.. వామపక్షాల అండతో జనంలోకి..
- మిగిలిన వారు ఉరుకులు.. పరుగులు

మూడు నెలల క్రితం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా, తాజాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి. ఇప్పటికే అధికార కూటమి పక్షాన తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని బరిలో నిలిపారు. నెలన్నర క్రితమే రాజశేఖరాన్ని కూటమి క్యాడర్‌కు పరిచయం చేశారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఓటర్ల నమోదులో నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఓటర్ల సంఖ్య పెరగని నియోజకవర్గాల బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికి నమోదైన ఓటర్ల సంఖ్య లక్షా పాతిక వేలకు మించ లేదు. సీఎం సీరియస్‌ను అర్థం చేసుకున్న నేతలంతా 45 రోజులుగా ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టడంతో ఈ సంఖ్య మూడు లక్షల 14 వేలకు పైగా చేరింది. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న పట్టభద్రులతోపాటు మిగతా వారు ఓటర్ల జాబితాలో చేరేందుకు ఆసక్తి చూపించడం కొత్త పరిణామం. నమోదైన ఓటర్ల సంఖ్యలో పురుష ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. సాధారణ ఎన్నికలకు ఇది రివర్స్‌గానే ఉంది.

టీడీపీ.. పీడీఎఫ్ మధ్యే పోటీ !

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న సందర్భంగా అభ్యర్థులంతా ఎవరంతటి వారీగా వ్యూహం అమలు చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తన గెలుపు విషయంలో భారమంతా సిట్టింగ్ ఎమ్మె ల్యేలు, నియోజకవర్గ సీనియర్లపైనే వేశారు. రాజశేఖ రం గెలిచి తీరాలని అధినాయకత్వం ఆదేశించడంతో ఆ దిశగా ముఖ్యులంతా ఓటర్లను పోలింగ్ కేంద్రా నికి చేర్చేందుకు కార్యాచరణలో ఉన్నారు. నియోజక వర్గాల వారీగా టీడీపీ పరిశీలకులను నియమించింది. జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు మండలాల వారీగా పట్టభద్రులను కలుస్తున్నారు. కూటమి ప్రభుత్వం కూటమి యువతకు అండగా నిలిచేందుకు చేస్తున్న ప్రయత్నాలను పదేపదే వారి చెవినవేస్తున్నారు. రాబోయే మెగా డీఎస్సీతోపాటు ఉపాధికి ఊతమిచ్చేలా తామెలాంటి చర్యలు తీసుకుంటున్నామో వివరించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కేడర్ యావత్తు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ఓ వైపు వామపక్షాలు కేడర్ అండదండలతో ప్రచారాన్ని వేగవంతం చేశారు. పట్టభద్రుల పక్షాన విధాన పరిషత్‌లో గళమెత్తే అవకాశం తనకు ఇవ్వాల్సిందిగా అన్నిచోట్ల ఏకరవు పెడుతున్నారు. ఉద్యోగాల్లో ఉన్నవారు తమ వైపే మొగ్గు చూపేలా ఎన్జీవోలు, టీచర్లను ఆకర్షించే పనిలో టీడీపీ, పీడీఎఫ్‌తోపాటు మిగిలిన అభ్యర్థులంతా ప్రయత్నాల్లో దిగారు. గతంకంటే ఈసారి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో గట్టి పట్టు నిలుపుకునేలా కరపత్రాల యుద్ధం చేస్తున్నారు. పోటీలోని అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండటంతో ఆ మేరకు బ్యాలెట్‌లో వరుస సంఖ్యను బట్టి తమ అదృష్టం ఆధారపడి ఉంటుందని మరికొందరు భావిస్తున్నారు.

ఇప్పటికి మూడుసార్లు

- ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి 2007 నుంచి ఇప్పటివరకు మూడు సార్లు ఎన్నికలు జరిగాయి. దీనికి భిన్నంగా నాలుగో విడత పోటీ హోరాహోరీగా సాగనుంది.
- 2007లో పీడీఎఫ్ అభ్యర్థి జార్జి విక్టర్ గెలుపొందారు. అప్పట్లో పట్టభద్రులైన ఓటర్ల సంఖ్య లక్షన్నరలోపే ఉంది.
- 2013 ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు తనయుడు రవికిరణ్‌వర్మ గెలుపొందారు. ఆ తర్వాత ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు అత్యధికులు ఉత్సాహం కనబరుస్తూ వచ్చారు.
- 2019లో నువ్వా నేనా అన్నట్లు పీడీఎఫ్ పక్షాన ఇళ్ల వెంకటేశ్వరరావు ఆదిత్య శేషారెడ్డిని ఢీకొన్నారు. అప్పుడు పరోక్షంగా వైసీపీ వర్గీయులంతా శేషారెడ్డి వైపే మొగ్గు చూపారు. పీడీఎఫ్ అభ్యర్థిగా ఉన్న ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)ను ఓడించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఓటర్లకు నజరానాలు పంచారు. ఓటర్లను విందు, వినోదాల్లో తేల్చారు. కానీ పీడీఎఫ్ అభ్యర్థిగా వెంకటేశ్వరరావు 65 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను పీడీఎఫ్ అభ్యర్థి తన విజయం వైపు మలుచుకున్నారు.

రాజశేఖరాన్ని గెలిపిద్దాం

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలిసి శుక్రవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు.



ఐదేళ్ల బాలికకు జీబీఎస్ !

- యర్రగుంటపల్లిలో నిర్ధారణ
- విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలింపు.. చికిత్స
- ఇది సాధారణ వ్యాధే.. ఆందోళన వద్దంటున్న వైద్యాధికారులు



యర్రగుంటపల్లిలో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పుణెలో వెలుగుచూసి.. ఏడుగురి ప్రాణాలను బలి తీసుకున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ఏలూరు జిల్లాను తాకింది. చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో ఐదేళ్ల బాలికకు ఈ లక్షణాలు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. 15 రోజులుగా ఆమెకు కండరాలు పట్టేయడంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులను సంప్రదించారు. బాలిక వెన్ను నుంచి నీరు తీసి సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్(సీఎస్ఎఫ్) పరీక్ష చేయగా జీబీఎస్ లక్షణాలుగా నిర్ధారణ అయిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సర్వైలెన్స్ ఆఫీసర్(ఎన్‌సీడీ) డాక్టర్ నరేంద్రకృష్ణ వెల్లడించారు. ప్రస్తుతం బాలికను విజయవాడ ప్రభుతాసుపత్రి పీడియాట్రిక్స్ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉందని, తదుపరి వైద్య పరీక్షలు, వేరియంట్, వైరల్ లోడ్ పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను బెంగళూరు లోని వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్టు వివరించారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా బాలిక నివసించే ప్రాంతంలో తాగునీటి వనరులు, పరిసరాల పరిశుభ్రతలపై చర్యలు తీసుకోవడంతోపాటు, ర్యాండమ్‌గా స్థానికంగా వున్న నలుగురి నుంచి మలం శాంపిల్స్‌ను సేకరించి మోషన్ టెస్టు కోసం ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు.

నేడు ఇంటింటా సర్వే

జీబీఎస్ లక్షణాలు గల వారిని గుర్తించేందుకు శనివారం నుంచే ఇంటింటా సర్వేను చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని జిల్లాలోని 64 పీహెచ్‌సీల వైద్యాధికారులను ఆదేశించారు. యర్రగుంటపల్లిలో మెడికల్ క్యాంపును ప్రారంభించడంతోపాటు, వైద్య సిబ్బంది అందరిని రంగంలోకి దించారు. ఇంటింటికీ పంపి జీబీఎస్ లక్షణాలుగల వారెవరైనా ఉన్నారా ? అనే కోణంలో నిశిత పరిశీలనను చేపట్టారు.

ఏమిటీ జీబీఎస్ ?

- జీబీఎస్ సాధారణంగా వ్యాపించేదే అయినా ఒకరి నుంచి ఒకరికి సోకే అంటు వ్యాధి కాదు. రోగ నిరోధక శక్తి తక్కువగా వున్న వ్యక్తుల్లో తొలుత నాడీవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీనిని నరాల సంబంధిత వ్యాధిగా పరిగణించవచ్చు.
- కలుషిత నీరు, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ వ్యాధి సోకుతుంది. మెదడు నుంచి కాళ్ల వరకు నరాలు ప్రభావితమై కాళ్లు చచ్చుబడటం, వీపు భాగం, చేతులు, మెడ, కండరాలు.. దేహమంతా అచేతనం కావడం జరుగుతాయి. కండరాల అచేతనం అందరిలో ఒకేలా ఉండబోదు.
- ప్రతీ అవయవాన్ని నియంత్రించే మెదడు ద్వారా శరీరంలోని ప్రతీ భాగానికి ఆదేశాలను పంపే నరాలపై ఉండే మైలీన్ పొర దెబ్బ తిని మెదడు నుంచి వచ్చే సంకేతాలు అందకపోవడంతో అవయవాలు చచ్చుబడి అచేతనమవుతాయి.

అధికారం .. ఉన్నా.. లేకున్నా.. వైసీపీ తీరింతే..!

- కవ్వింపు చర్యలతో రెచ్చగొట్టే ధోరణి
- దెందులూరులో పెరుగుతున్న ఆగడాలు

పెదవేగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):అధికారం పోయినా వైసీపీ తీరు మారడం లేదు. చిన్నా, పెద్దా సంఘటన తేడా లేకుండా రెచ్చగొట్టే ధోరణితో ఘర్షణ వాతావరణం.. అధికారంలో ఉన్నప్పుడు కాలు కదపనీయకుండా టీడీపీ నాయకులను అడ్డుకున్న వైసీపీ.. ఇప్పుడు అధికారం పోయినా తగ్గేదేలే..! అన్నట్టు కవ్వింపు చర్యలతో వివాదాలను సృష్టిస్తోంది. ప్రత్యర్థిని రెచ్చగొట్టే ధోరణి ఏ పార్టీకైనా మంచిది కాదు. కానీ వైసీపీ అదే ధోరణిని ప్రదర్శిస్తోంది. దీనికి బుధవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకే సాక్ష్యం. కారు వెళ్లడానికి అడ్డుగా ఉంది.. కారును తీయమని డ్రైవర్ కోరినా కారు తీయకుండా దుర్భాషలాడి, డ్రైవర్‌పై దాడికి దిగడం వైసీపీ చర్యలకు పరాకాష్ట. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై దాడికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రయత్నించారనే సమాచారం క్షణాల్లో నియోజకవర్గమంతా పాకింది. అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు తమ నాయకుడి ఇంటికి చేరుకుని, వైసీపీ శ్రేణులపై దాడికి సిద్ధమన్నట్లు ఆగ్రహంతో రగిలిపోయారు. కానీ ఎమ్మెల్యే చింతమనేని వారిని సముదాయించారు. 'సంయమనం పాటించాలి. మనం అధికారంలో ఉన్నాం. తప్పు చేయకూడదు. దాడులకు ప్రతి దాడి సమాధానం కాదు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదుచేశాం. తప్పు చేసిన వారిని చట్టం వదిలిపెట్టదు. మనం తొందరపడవద్దు' అంటూ చింతమనేని తన అనుచరులను సముదాయించారు.

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో..

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో దెందులూరులో టీడీపీ నాయకులపై ఆ పార్టీ నాయకులు దాడులతో విరుచుకుపడ్డారు. బాధితులుగా ఉన్న తమపైనే అక్రమంగా కేసులు బనాయించినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో టీడీపీ నాయకులు అల్లాడారు. పెదవేగి మండలం లక్ష్మీపురం సమీపంలో పోలవరం కుడికాల్వ మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ వర్గీయులపై అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. పారిపోతున్న వారిని వెంటాడి మరీ తీవ్రంగా గాయపర్చారు. వైసీపీ వర్గీయులు బరితెగించి ఇంతగా దాడులు చేస్తున్నా అక్కడే ఉన్న పోలీసులు ఏమీ చేయలేని స్థితిలో మిన్నకుండిపోయారు. టీడీపీకి చెందిన పది కార్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. దెందులూరు మండలం జోగన్నపాలెంకు చెందిన సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధుబాబు, పెదవేగికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తాతా సత్యనారాయణను కిందపడేసి కొట్టారు.

అక్రమ కేసులతో వేధింపులు

అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ టీడీపీ నేతలపై దాడులే లక్ష్యంగా అక్రమ కేసులతో వేధించారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలో టీడీపీ నేతలపై అక్రమంగా కేసులు బనాయించి, జైలుకు పంపించారు. ఆ కేసులకు సంబంధించి ఇప్పటికీ కొంతమంది కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అధికారంలో లేకపోయినా..

గడచిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందిన వారిలో ఇసుమంతైనా మార్పు కనిపించడం లేదని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో చూపించిన దర్పాన్ని ఇప్పటికీ ప్రదర్శిస్తూ గ్రామాల్లో వివాదాలకు తెరతీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వారం క్రితం విదేశాల నుంచి వచ్చారు. అప్పటి నుంచి తిరిగి నియోజకవర్గంలో వివాదాలకు బీజం పడిందని ఆరోపణలు ఉన్నాయి. ఏమైనా ఘర్షణలు జరుగుతాయనే ముందస్తు ఆలోచనతో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ బుధవారం రాత్రి జరిగిన చిన్న ఘటనతో టీడీపీ - వైసీపీ మధ్య వివాదం తారస్థాయికి చేరింది. వైసీపీ కవ్వింపు చర్యలతో ఇప్పుడు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యిందని ప్రజలు అంటున్నారు.



కొండలరావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు నివాసం సమీపంలో పోలీసు బందోబస్తు

లంచం.. ఇస్తేనే సాగు

సన్న, చిన్నకారు రైతుల్ని పీక్కుతింటున్న ఓ ఫారెస్టు ఆఫీసర్

ఎంత లంచం ఇచ్చినా చాలడం లేదంటూ మరింత డిమాండ్

లంచగొండి అధికారిపై చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

7

ఆగని చికెన్ వ్యర్థాల రవాణా

చేపలకు మేతగా చికెన్.. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో భయపడుతున్న ప్రజలు



ప్రత్యేక అలంకరణల్లో వాసవి అమ్మవారు

పెనుగొండ వాసవి ధామ్‌లో
తమిళనాడు భక్తుల పూజలు

పెనుగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో తమిళనాడు సేలం నుంచి వచ్చిన వాసవి భక్తులు శుక్రవారం పూజలు కొనసాగించారు. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సేలం జిల్లా నుంచి సుమారు వెయ్యి మంది వాసవి భక్తులు ప్రత్యేక రైలులో పెనుగొండ తరలివచ్చారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మూలవిరాట్ శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాతంగి సేవ, మహా దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం భారీ గ్రామోత్సవం నిర్వహించారు. తమిళనాడు ఆచారాలతో తంబతి పూజ నిర్వహించారు. ప్రత్యేక వాయిద్యాలు, ప్రత్యేక నాద బృందాలు ఆకర్షణగా నిలిచాయి. వాసవి మాతను ప్రత్యేకంగా అలంకరించి వాసవి ప్రతిమలను ఏర్పాటుచేసి మహా చండీ హోమం నిర్వహించారు. మహాసభ చైర్మన్ వీఎన్.శ్రీనివాసన్, కార్యదర్శి ఎం.సురేంద్రన్, కోశాధికారి ఎస్.గోపాల మురుగన్, పీఆర్‌వో జె.ప్రభాకరన్, సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రతిమలు, కలశాలతో ప్రత్యేక పూజలు



వంకాయలపాలెంలో రక్షిత నీరు పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు



రక్షిత నీటిపథకంలో నిర్మించిన ఎస్ఎస్ ఫిల్టర్ బెడ్‌లు



నీటిని శుద్ధి చేయడానికి ఏర్పాటుచేసిన పైపుల గ్రిడ్

తక్కువ ఖర్చుతో
రక్షిత నీరు



సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కు పరిష్కారం కానరావడం లేదు. స్వచ్ఛమైన నీరందని గ్రామాలెన్నో.. తాగునీటి సమస్యలతో ఎదురయ్యే అనారోగ్య పరిస్థితులెన్నో.. ఇలాంటి తరుణంలో పాలకోడేరు మండలం విస్సాకోడేరులో తక్కువ పెట్టుబడితో స్వచ్ఛమైన తాగునీరందించే ప్రయత్నం విజయవంతమైంది. రూ.30 లక్షలపైగా పెట్టుబడితో మంచినీటి పథకంలో ఏర్పాటుచేసే ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్ కేవలం రూ.2 లక్షలతో ప్రయోగం చేశారు. గ్రామ ప్రజలందరికి మంచినీరు అందుతోంది.

- పాలకోడేరు, ఆంధ్రజ్యోతి

- విస్సాకోడేరులో రూ.2 లక్షలతో ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్
- ఫలించిన ప్రయోగం
- మున్సిపాలిటీ తరహాలో గ్రామంలో తాగునీటి సరఫరా
- డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశంస
- ప్లాంట్ ఏర్పాటుపై మరింత మంది ఆసక్తి

విస్సాకోడేరు గ్రామస్తులకు రక్షితనీరు అందించడానికి సర్పంచ్, అధికారులు చేసిన ప్రయోగం ఫలించింది. ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితం రావడానికి చొరవ చూపిన సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, అధికారులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

స్వచ్ఛ నీరు ఇలా..

- ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా ఫిల్టరేషన్‌తో స్వచ్ఛమైన నీరు విడుదలవుతుంది. అలాంటి ప్లాంట్‌లో ఉపయోగించే ఆలంతో ఫిల్టర్ గ్రిడ్ ఏర్పాటుకు రూ.30 లక్షలు వెచ్చించి సిమెంట్ పైపులు కట్టాలి.
- విస్సాకోడేరులో మంచినీటి పథకం వద్ద రూ.2 లక్షలతో పైపులతో ఆ తరహాలోనే గ్రిడ్ నిర్మాణం చేపట్టారు.
- పైప్ గ్రిడ్‌లో పటికతో కూడిన నీటిని పంపిస్తారు.
- గొట్టాల్లో నీరు తిరుగుతూ కింద ఏర్పాటు చేసిన ట్యాంక్‌లో చేరుతుంది.
- అక్కడ మట్టిశాతం కిందికి దిగి శుద్ధి అయిన జలం పైకి వస్తుంది.
- ఆ నీటిని ఫిల్టర్ బెడ్‌లోకి పంపిస్తారు. అప్పటికే 90 శాతం శుద్ధి కావడంతో ఫిల్టర్ బెడ్‌ల నుంచి ఓహెచ్ఆర్‌కు పంపిస్తారు.

ఫిల్టర్ బెడ్ సమస్యకు పరిష్కారం

ఈ విధానంలో ఫిల్టర్ బెడ్‌ల సమస్యకు మంచి పరిష్కారం దొరికినట్టే. ఏడాదిలో మరమ్మతులకు గురయ్యే ఫిల్టర్ బెడ్‌లు ఐదారేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. స్వచ్ఛమైన నీరు కూడా ప్రజలకు చేరువ అవుతుంది. ఈ వినూత్న ప్రయోగం మిగిలిన గ్రామాల్లోని మంచినీటి పథకాలకు కూడా చేరితే గ్రామాల్లో తాగునీటి సమస్య అధిగమించే అవకాశం పాలకవర్గాలకు ఉంటుంది. పంచాయతీలకు ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతుల భారం తగ్గుతుంది. పంచాయతీ ఆదాయం వృద్ధి అవుతుందని నిపుణులు లెక్కలు వేస్తున్నారు.

పవన్ కల్యాణ్ ప్రశంస

విస్సాకోడేరులో తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితం సాధించడం, ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు రక్షిత నీరందించడం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లింది. ఎక్స్ వేదికగా విస్సాకోడేరు పంచాయతీపై ప్రశంసల వర్షం కురిపిస్తూ ట్వీట్ చేశారు. దీంతో విస్సాకోడేరు గ్రామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రతి ఒక్కరూ వాటర్ ప్లాంట్ నిర్మించిన తీరుతెన్నుల గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.



ప్రజలకు రక్షిత నీరిస్తున్నాం

విస్సాకోడేరులో తాగునీటి సమస్య చాలా ఎక్కువ. ఎంతో మంది నిపుణులను సంప్రదించాను. పైప్‌గ్రిడ్ ప్లాంట్ మంచి ఫలితాన్నిచ్చింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలు వచ్చేవిధంగా ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాను. ఈ ప్లాంట్ ద్వారా మునిసిపాలిటీలతో సమానంగా రోజుకు 8లక్షల నీటిని శుద్ధిచేసి అందిస్తున్నాం.

బొల్లా శ్రీనివాస్, సర్పంచ్, విస్సాకోడేరు

రైతుబజార్లలో సబ్జీ కూలర్



- కూరగాయలు, ఆకు కూరల నిల్వకు ప్రత్యేకం
- విద్యుత్ అవసరం లేదు
- ఐస్‌తో పని లేదు
- నీరుంటే చాలు
- వారం రోజుల వరకు తాజా
- ఐఐటీ ముంబై నిపుణుల సృష్టి
- తొలుత పట్టణాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతు బజార్లలో తాజా ఆకు కూరలు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు కూడా ఆకుకూరలు, కూరగాయలు వారం రోజుల వరకు తాజాగా ఉండేలా చూసుకోవచ్చు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సబ్జీ కూలర్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ విధానం వల్ల రైతులపై అదనపు భారం పడదు. రైతు బజార్లలో రైతులు సంఘంగా కొంత వాటా చెల్లించి సబ్జీ కూలర్ పొందవచ్చు. ప్రస్తుతం నగరాల్లోని రైతు బజార్‌లలో ఏర్పాటు చేశారు. త్వరలో పట్టణాల్లోని రైతు బజార్లలో సబ్జీ కూలర్ ఏర్పాటు చేయనున్నారు.

సబ్జీ కూలర్..

- ముంబై ఐఐటీ నిపుణులు సబ్జీ కూలర్‌ను తయారుచేసినట్లు అధికారులు చెబుతున్నారు.
- ఎటువంటి విద్యుత్ సౌకర్యం అవసరంలేదు.
- దీనిలోని ట్యాంక్ గాల్వనైజ్డ్ ఇనుముతో తయారు చేస్తారు.
- ట్యాంక్‌ను చల్లబరచడానికి ప్లాస్టిక్ బంతులను ఉపయోగిస్తారు.
- కొన్ని సబ్జీ కూలర్లు వెచ్చని గాలిని లోపలికి లాగి చల్లటి గాలిని విడుదల చేయడానికి నీటితో నిండిన ప్యాడ్లను ఉపయోగిస్తాయి.
- కొన్ని సబ్జీ కూలర్లను ఇటుక, సిమెంట్ గదిలో ఉంచుతారు.
- కూరగాయలను ప్లాస్టిక్ ట్రేలలో పెట్టి కూలర్లలో ఉంచుతారు.
- కేవలం 20 లీటర్ల నీటితో వినియోగించి పనిచేయించవచ్చు.
- ఇందులో వస్తువులు దాదాపు 7 రోజుల వరకు తాజాగా ఉంటాయి.
- ఓపెన్ ప్లేస్‌లో ఉంచుకుని వినియోగించుకోవచ్చు.
- 100, 50, 25 కేజీల నిల్వ సామర్థ్యంతో ఈ సబ్జీలు ఉంటాయి.

ఏ వస్తువులు నిల్వ చేసుకోవచ్చు

పండ్లు, కూరగాయలు, త్వరగా పాడైపోయే టమటా, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, ఆకుకూరలు ఇందులో నిల్వ ఉంచుకోవచ్చు. దీనివల్ల రైతులకు ప్రయోజనం. ప్రస్తుతం విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, చిత్తూరు, విశాఖపట్నంలోని రైతు బజార్లలో ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేస్తున్నారు.

త్వరలో పశ్చిమకు..

జిల్లాలో ప్రస్తుతం భీమవరం, నరసాపురం, పాలకొల్లు మునిసిపాల్టీల పరిధిలో రైతు బజార్లు ఉన్నాయి. భీమవరం, నరసాపురం రైతు బజార్లలో సబ్జీ కూలర్స్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ కూలర్స్‌కు సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. కొంత మంది రైతులు ముందుకు వస్తున్నారు. మొదటగా భీమవరం రైతు బజార్‌లో ఏర్పాటు చెయ్యనున్నారు.

సబ్సిడీపై రైతులకు..

సబ్జీ సామర్థ్యాన్ని బట్టి ధరలు ఉంటాయి. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించనుంది. రైతులు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడితే ఉద్యావన శాఖ 50 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన సొమ్మును రైతులు ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. త్వరలో ఈ కూలర్స్ అందుబాటులోకి వస్తే ఇక రైతు బజార్‌లో తాజా కూరలు అందుబాటులో ఉంటాయి.

తల్లీ బిడ్డలకు ఆరోగ్యం

తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఆసుపత్రుల్లో కేంద్రాల ఏర్పాటు

- గతంలో నిధులు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- తిరిగి కూటమిలో కదలిక
- నిర్మాణ పనులు వేగవంతం
- మార్చిలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం దిశానిర్దేశం
- కాంట్రాక్టర్‌కు బకాయిల చెల్లింపు



గొల్లవానితిప్ప రోడ్డులో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆస్పత్రి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మహిళకు మాతృత్వం ఓ వరం. ప్రతి గర్భిణీ క్షేమంగా బిడ్డను కనాలని కుటుంబ సభ్యులు కలలు కంటారు. చేతిలో డబ్బు లేని పరిస్థితిలో నెలలు నిండిన తర్వాత ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలంటే దిక్కుతోచదు. ఎక్కువ మంది ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతుంటారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇతర సేవలు ఎలా ఉన్నా ప్రశూతి విభాగానికి డిమాండ్ ఉంటుంది. గర్భిణులు అత్యధికంగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తారు.

జిల్లాలో దాదాపు 50శాతం కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్వహిస్తున్నారు. తల్లీ బిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీటవేస్తుంది. డెలివరీ అయిన తర్వాత తల్లీ బిడ్డలను ప్రభుత్వ అంబులెన్స్‌లో ఇంటికి చేరవేస్తున్నారు. మూడో నెలనుంచే గర్భిణీ ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. ప్రతినెలా క్రమం తప్పకుండా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటోంది. మందులను ఉచితంగా ఇస్తోంది. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రిపైనే ఆధారపడుతున్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ఆసుపత్రుల్లో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు చేశాయి. గతంలో టీడీపీ పాలనలోనే భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో మాతా శిశు సంరక్షణ కేంద్రాలకు నిధులు కేటాయించింది. అప్పట్లోనే పనులు ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా మంజూరు చేయలేదు. దాంతో పనులు మందకొడిగా సాగాయి. తెలుగుదేశం కూటమి (ఎన్డీఏ) ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాతా శిశు ఆరోగ్య కేంద్రాలపై దృష్టి పెట్టింది. తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఏరియా ఆసుపత్రుల్లో నిర్మాణం చేపట్టిన మాతా శిశు కేంద్రాలను మార్చి 31లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. బకాయిలను చెల్లించింది.

పనులు వేగవంతం

బకాయిలు చెల్లించడంతో కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేశారు. గడవులోగా పనులు పూర్తి చేయడానికి ఆపసోపాలు పడుతున్నారు. గత ఐదేళ్ల పట్టింపు లేకపోవడంతో కాంట్రాక్టర్లు ముఖం చాటేశారు. కేంద్రం నుంచి ఒత్తిడి వస్తుండడంతో కొద్దిపాటి పనులతో సరిపెట్టారు. వాటికి కూడా సకాలంలో బిల్లులు చెల్లించలేదు. కోట్ల రూపాయలు పెండింగ్‌లో పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టారు. బిల్లులు చెల్లింపుకోసం ప్రాధాన్యం ఇచ్చారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రాల బిల్లులను మంజూరు చేశారు.

తాడేపల్లిగూడెంలో రూ.11.22 కోట్లు, పాలకొల్లులో రూ.12.50 కోట్లతో పనులు చేపడుతు న్నారు. ఇలా కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం కేటాయిస్తోంది. ప్రస్తుతం కాస్త కష్టతరమైన కాన్పులు అయితే ఏలూరుకు సిఫారసు చేస్తున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రాలు పూర్తయితే అటువంటి ఇబ్బందులుండవు. గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు, శస్త్రచికిత్సకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లనవసరం లేదు. ప్రసూతి నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు.

ప్రసూతి విభాగంలో ఆరోగ్యశ్రీ

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి విభాగంలో ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నారు. శస్త్రచికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీలో నిర్వహించేందుకు అవకాశం ఉంది. దీనివల్ల సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రులకు ఆదాయం వస్తుంది. వైద్యులకు సైతం ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. పేదలు, సామాన్యులంతా ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులకు ఆసక్తి చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సేవలు అందించడానికి మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందుకోసం కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. అవి అందుబాటోకి వస్తే ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రసూతి సేవలు అందనున్నాయి.



తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో నిర్మిస్తున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం



మండుతున్న ఎండ

38 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరిన ఉష్ణోగ్రతలు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతున్నాయి. వేసవి ఇప్పుడిప్పుడే ఆరంభమైనా ఎండ మండుతోంది. ఉమ్మడి జిల్లాలో ఫిబ్రవరి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు పెరిగాయి. మే ఉష్ణోగ్రతలు సెగలు పుట్టిస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా శివరాత్రి తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ నెల 4న రథసప్తమి నుంచి భానుడి ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్ నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వారం రోజులుగా ఉష్ణోగ్రతల స్థాయి పెరుగుతోంది. 36 నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా రాత్రి ఉష్ణోగ్రతలు 18 నుంచి 20 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదవుతున్నాయి.

విభిన్న వాతావరణం

పగలు ఎండ, రాత్రి సమయాల్లో చలి, తెల్లవారుజాము నుంచి మంచుతో విభిన్న వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పగలు ఎండ తీవ్రత కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. విభిన్న వాతావరణంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో అల్లాడుతున్నారు. దీనికి తోడు ఇటువంటి వాతావరణ పరిస్థితులలో ఎటువంటి వైరస్‌లు వ్యాప్తి చెందుతాయోనని ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. ఎండ తీవ్రత పెరుగుతుండడంతో పగటి పూట ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎండల తీవ్రత పెరిగితే సాగు, తాగు నీటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత ఎండ తీవ్రత కంగారు పెడితే ఏప్రిల్, మే ఎండలో జనం ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదని భయపడుతున్నారు.





రత్నకుమార్

19న భీమవరంలో సినిమా ఆడిషన్స్

భీమవరం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై విజయ దేవరకొండ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మించే చిత్రానికి నూతన నటీనటుల ఎంపిక చేయనున్నారు. ఈ నెల 19న భీమవరంలో ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రత్నకుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో చిత్ర నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో నటీనటులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఐదు నుంచి 14 ఏళ్ల బాలురు, 5 నుంచి 12 ఏళ్ల బాలికలు, 25 నుంచి 65 ఏళ్ల పురుషులు, మహిళలు ఆడిషన్‌లో పాల్గొనవచ్చన్నారు. అదే రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లీలాకృష్ణ గ్రాండ్స్‌లో ఆడిషన్స్ జరుగుతాయని, ఉచితంగానే పాల్గొనవచ్చని తెలిపారు.



పాలకోడేరులో 4 గ్రామాల కూడలి

ఒకే సరిహద్దు.. నాలుగు గ్రామాలు!

పాలకోడేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒక గ్రామానికి మరో గ్రామం సరిహద్దు ఉండడం పరిపాటి. పాలకోడేరు గ్రామ శివారులోని గోస్తనీ నది ప్రాంతం నాలుగు గ్రామాలకు సరిహద్దుగా ఉంది. మండల కేంద్రమైన పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు, వేండ్ర గ్రామాలకు ఈ కూడలి సరిహద్దు. గోస్తనీ నది ప్రసిద్ధి చెందిన ప్రాంతం. కాశీకి వెళ్లలేని వారంతా ఈ ప్రాంతాన్ని మరో కాశీగా భావించి ఆ ప్రాంతంలో అస్తికలను కలుపుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తూ ఉండేవారు. కాలక్రమేణా ఆ నది కాలుష్య కాసారమైంది. పుణ్యనది నాలుగు గ్రామాల ప్రాంత వాసులకు ఒక సరిహద్దుగా నిలవడంతో గ్రామవాసులు గొప్పగా చెప్పుకుంటారు. ఇలా ఒకే సరిహద్దు నాలుగు గ్రామాలకు ఎక్కడోగాని ఉండదని స్థానికులు చెప్పుకుంటూ ఉంటారు.

లంచం ఇస్తేనే సాగు

- సన్న, చిన్నకారు రైతుల్ని పీక్కుతింటున్న ఓ ఫారెస్టు ఆఫీసర్
- ఎంత లంచం ఇచ్చినా చాలడం లేదంటూ మరింత డిమాండ్
- లంచగొండి అధికారిపై చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

లంచగొండిలపై చర్యలు తీసుకోవాలి



మా అన్నదమ్ములకు అంతా కలిపి 5.5 ఎకరాల భూమి ఉన్నది. మా అన్నగారి అమ్మాయికి దీని నుంచి ఒక ఎకరం భూమి కట్నం గా ఇచ్చాం. ఈ భూమికి సాగు లేక ఆదాయం లేక కాపురంలో కలతలు కూడా వచ్చాయి. మగతా కోసం గొడవలు పడడంతో పెద్దల మధ్య సఖ్యత కుదిర్చి ఆ మగ తా సొమ్ము మా అన్న కుటుంబం కూలిపని చేసుకొంటూ కౌలు చెల్లిస్తున్నారు. పొలం సాగైతే బాగుంటుందని బావించి పారెస్టు ఆఫీసురు అడిగిన రూ.30వేలు ఫిబ్రవరి 6వ తేదీన లంచం ఇచ్చాం. మరలా సొమ్ములు చాల్లేదని అడగటంతో ఫిబ్రవరి 10న మరో 10 వేలు ఫోన్‌పే చేశాం. ఇంకా చాలదంటూ రోజు హింసిస్తున్నాడు. మా జిరాయితీ భూముల్లో సాగుకు అనుమతి ఇవ్వాలి.

- మండా పోలయ్య, రైతు, నిడమర్రు

పొలం ఉండి కూలికి వెళుతున్నా..



20 ఏళ్ళుగా నాకున్న 2 ఎకరాల భూమిని సాగు చేయలేకపోయాను. మా పొల్లాలన్నీ ఉప్పునీటి కయ్యలు అయ్యా యి. సొంత పొలం ఉండి కూలీపనులకు వెళ్లాల్సి వస్తోంది. నా భూమిలో సాగు కోసం ఫారెస్టు వారు లంచం డిమాండ్ చేస్తున్నారు. మమ్మల్ని మానసింకంగా హింసిస్తున్నారు.

- పల్లా నాగేశ్వరరావు, రైతు, నిడమర్రు

నిడమర్రు ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు జిరాయితీ భూముల్లో సాంప్రదాయ సాగు చేసుకోవడానికి అనుమతి కోసం వేడుకొంటుంటే లంచాలు డిమాండ్ చేస్తూ మానసిన క్షోభకు గురిచేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామం వెంకటాపురంలో సుమారు 200 మంది పైచిలుకు సన్న, చిన్నకారు రైతులకు 600 ఎకరాలు కొల్లేరు జిరాయితీ భూమి ఉన్నది. తాతల కాలం నుంచి కొల్లేరు భూములపై ఆధారపడి సాంప్రదాయ వ్యవసాయ సాగు చేస్తున్నారు. ఆ భూమిని సాగుచేసుకొని రైతులు తమ కుటుంబ జీవనాన్ని గడుపుకొనేవారు. కాలం గడుస్తున్న కొద్దీ కోల్లేరు అన్‌సర్వే భూముల్లో ఇష్టారాజ్యంగా రొయ్యలు, చేపల చెరువుల తవ్వకం వలన వ్యవసాయ పొల్లాల్లో ఉప్పునీరు చేరిపోయి సాగుకు ఆటంకం ఏర్పడింది. రైతులు తమ పొలాలను వదిలి ఏమి చేయలేక కూలీనాలీ చేసుకొని బ్రతువెళ్లదీస్తున్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో జిరాయితీ భూములలో చెరువులను ధ్వంసం చేశారు. కానీ రైతులకు నష్టపరిహారం అందివ్వలేదు. అయితే గత ఏడాది రైతులు సాగుకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో సాగుకు అనుమతి ఇవ్వాలంటే లంచం ఇవ్వాలనే డిమాండ్ అధికారుల నుంచి వచ్చింది.

రైతులపై బైండోవర్ కేసులు

గత 18 ఏళ్ళగా తమ భూమి పనికి రాకుండా బీడు భూములుగా మారాయని, దీని వల్ల తమకు ఆదాయం లేకుండా పోతుందని రైతులందరూ మూకుమ్మడిగా 2024 మార్చినెలలో తమ జిరాయితీ భూములను సాగుచేయడానికి ట్రాక్టర్లతో ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు తమ బెటాలియన్‌తో వచ్చి రైతుల ప్రయత్నాలను అడ్డుకొని వారికి నోటీసులు ఇచ్చి బైండోవర్ కేసులు పెట్టారని వాపోయారు. దీంతో రైతులు జిల్లా అధికారులను, ప్రజాప్రతినిధులను విన్నవించుకొన్నప్పటికీ ఫలితం మాత్రం లేకుండా పోయింది.

సాగు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే

గత సంవత్సరం నిలుపుదల చేసిన భూముల్లో సాగు నిమిత్తం అంతా తానే చూసుకొంటానంటూ ఏలూరు జిల్లా ఫారెస్టురేంజ్ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నబిగరి శ్రీనివాసబాబు రైతులతో లంచాల రాయభారం నడిపాడు. తొలుత ఎకరానికి రూ.30 వేలు ఇస్తే సాగుచేసుకోవచ్చని రైతులను నమ్మబలికాడు. ఆ మాటలు నమ్మి చాలామంది రైతులు కొంతమొత్తంలో సొమ్ములు కూడా చెల్లించారు. మరో దఫాగా మరో రూ.10 వేలు డబ్బులు డిమాండ్ చేయగా రైతు మండా పోలయ్య ఆ ఉద్యోగి సొంత నెంబరుకు ఫోన్ పేకు రూ.10 వేలు కూడా లంచంగా ఇచ్చాడు. ఇదీ చాలదంటూ మరో రూ.10వేల డిమాండ్ చేస్తున్నాడని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేసేది లేక మీడియాను ఆశ్రయించామని రైతులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు ఇవ్వాలంటూ ఒత్తిడి

తాను జిల్లా కార్యాలయ ఉద్యోగినని, తన చేతిలో ఉన్నతాధికారులు ఉన్నారని, తానుఏమి చెబితే వారు అదే చేస్తారని రైతులను నమ్మబలికాడు. తాను ఏలూరు జిల్లా పారెస్టు ఆఫీసును చూసుకొంటానని, తనకు సొమ్ములు ముట్టచెబితే ఉన్నతాధికారులకు మామూళ్ళు సమర్పించి మీ పని మూడోకంటోడికి తెలియకుండా చేస్తానని మాయ మాటలు చెప్పాడు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసు బాబుకు లంచం ఇచ్చిన సొమ్ము సి.సి.ఫుటేజ్‌లు, ఫొటోలతో సహా ఉన్నాయని, ఫోన్‌పే రసీదులు కూడా తమ వద్ద ఉన్నాయని రైతులు చెబు తున్నారు.



సి.సి. ఫుటేజీలో లంచం దృశ్యం

విచారణ చేపడతాం

బి.విజయ, డీఎఫ్‌వో (వైల్డ్ లైఫ్) ఏలూరు జిల్లా

అటవీ సిబ్బందిపై లంచం ఆరోప ణలు ఇప్పుడే తన దృష్టికి వచ్చాయి. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపడతాం. ఆరోపణలు నిజమని తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటాం. లంచం తీసుకోవడం చట్టరీత్యా నేరం.

రెడ్‌జోన్‌లోని పౌల్ట్రీ ఫారాల క్లీనింగ్



వేల్పూరు రెడ్‌జోన్‌లోని ఫారంలో కోళ్ల మేతను ధ్వంసం చేయడానికి సిద్ధమైన సిబ్బంది

తణుకు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీ ఫారాలలో చేపట్టిన బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావిత కోళ్ల ఖననం కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వేల్పూరు రెడ్‌జోన్ పరిధిలోని ఆరు పౌల్ట్రీ ఫారాలలోని 21,907 కోళ్లను చంపి ఖననం చేసినట్లు తెలిపారు. కోళ్లతో పాటు ఫారాల్లో మిగిలి పోయిన 7,591 కోడి గుడ్లు, మొక్క జొన్న, ప్రొటీన్ ఫుడ్, షెడ్ గ్రిడ్, నూకలు, సూర్య రమణ ఫారాల్లోని 17,078 కోడి గుడ్లు, మొక్క జొన్న, నూకలు భూమిలో ఖననం చేసినట్లు తెలిపారు. ఇన్‌ఫెక్షన్ జోన్‌లోని కోళ్ల ఫారాలను పశువైద్య సిబ్బంది సమక్షంలో రైతులు తమ ఫారాలను శుభ్ర పర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆగని చికెన్ వ్యర్థాల రవాణా

చేపలకు మేతగా చికెన్.. - బర్డ్ ఫ్లూ నేపథ్యంలో భయపడుతున్న ప్రజలు

పెదపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువులకు మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాల రవాణా ఏ మాత్రం ఆగలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతిరోజూ హైదరాబాద్ వంటి దూరప్రాంతాల నుంచి టన్నుల కొద్దీ చికెన్ వ్యర్థాలను యథేచ్ఛగా లారీల్లో మండలంలోని వీరమ్మకుంట, ముప్పర్రు, గుడిపాడు, వడ్డిగూడెం, కొణికి గ్రామాలతో పాటుగా పరిసర గ్రామాల్లోని చేపల చెరువులకు మేతగా తరలిస్తున్నారు. గత 45 రోజుల వ్యవధిలో సుమారు 20 కేసులు నమోదు చేసి 20 వాహనాలను, అందులోని సుమారు 1.5 లక్షల టన్నుల చికెన్‌వ్యర్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చికెన్ వ్యర్థాలతో వాతావరణం, నీరు కలుషితమవుతూనే ఉంది. కొత్తగా కొన్ని జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి వెలుగుచూడటం, లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతుండటంతో ఆయా ప్రాంతాలను అధికారులు రెడ్‌జోన్లుగా ప్రకటించి మృత్యువాత పడిన, మిగిలిన కోళ్లను సైతం పూడ్చి పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడెక్కడి నుంచో కుళ్లి, దుర్వాసనతో కూడిన చికెన్ వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను వేల టన్నుల్లో గ్రామాల్లోకి తీసుకువస్తుండటం, వాటిని చేపల చెరువుల్లో మేతగా వేయడం, ఆ వాహనాలను సమీపంలోని కాలువలు, చెరు వులు, సర్వీసింగ్ సెంటర్ల వద్ద శుభ్రం చేయి స్తుండటంతో ఆ ప్రాంతాలన్నీ తీవ్ర కలుషితంగా మారిపోతున్నాయి. పైగా బర్డ్ ఫ్లూతో మృత్యు వాత పడిన కోళ్లను చేపలకు మేతగా వేస్తే.. ఆచేపలు తిన్న మనుషుల పరిస్థితి ఆలోచిస్తే భయమేస్తుంది. పైగా పోలీసులు స్వాధీనం చేసు కున్న చికెన్ వ్యర్థాలను పోలీసులు కాల్వ గట్లు వెంబడి పూడ్చివేస్తున్నారు. దీనితో పర్యావరణం దెబ్బతింటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చికెన్ వ్యర్థాలతో కూడిన వాహనాలు

రెండు వాహనాలు స్వాధీనం

చేపల చెరువులకు మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో తనిఖీలు నిర్వహించి రెండు ఐషర్ వాహనాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనాల్లోని సుమారు 16 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించి, వాహన, చెరువు యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెంపుడు కుక్కల్లో వైరస్

తణుకు: పెంపుడు కుక్కల్లో వైరస్‌లు విజృంభి స్తున్నాయి. సరైన నివారణ చర్యలు తీసుకోక పోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తప్పడం లేదు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపే పప్పీలకు ఒక్కసారిగా నీరసంగా ఉండే పరిస్థి తులు వస్తాయి. ప్రధానంగా పెంపుడు కుక్కల్లో పార్వో వైరస్, కెనైన్ డిస్టెంపర్(సిడి) వైరస్‌లు వస్తున్నాయి. ఆయా వైరస్‌లు వల్ల సరైన సం రక్షణ, వైద్యం అందకపోతే ప్రమాద పరి స్థితిలోకి వెళ్లినట్టవుతుంది. పెంపుడు కుక్కలకు పాములు, నులిపురుగులు, అంతర పరాన్న జీవుల నిర్మూలనకు సంబంధించిన మందులు వావాలి. ప్రతినెల పాముల మందు వేయాలి. వైరస్‌లు సోకిన వాటికి వాంతులు, చెడువాసన గల రక్తపు విరేచనాలు వస్తాయి. ఒక్కోసారి చిన్న కుక్క పిల్లలకు మరణాలు ఉంటాయి. కనీసం ఐదు నుంచి ఆరు రోజులు పాటు రక్తపు విరేచనాలు ఆగే పరిస్థితి ఉండదు. పక్షవాతం, ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పచ్చ కామెర్లు కొన్ని బ్యాక్టీరియాల వల్ల, వైరస్‌లు వల్ల వస్తాయి. వీటి నివారణకు సెవిఎన్ ఇన్‌ఒన్, నైన్ ఇన్ ఒన్ వంటివి పలు రకాల వ్యాక్సిన్‌లు వాడడంతో తగ్గుతాయి.

- డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్, తణుకు

కుక్కలకు వ్యాధులు

పెదపాడు: చికెన్ వ్యర్థాలను మేతగా వినియోగించే చెరువుల వద్ద సంచరించే కుక్కలు వ్యర్థాలను తిని అనేక రకాల వ్యాధులతో పాటుగా చర్మ సంబంధిత రోగాల బారినపడుతున్నాయి. ఆ కుక్కలు గ్రామాల్లోకి వచ్చినప్పుడు వీధికుక్కలకు ఆ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలతో కాలువలు కలుషితం



మోగల్లు వద్ద రేలంగి కెనాల్‌లో కోళ్ల కళేబరాల మూటలు

పాలకోడేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామంలోని రేలంగి కెనాల్‌లో కోళ్ల వ్యర్థాల మూటలు కట్టి కాలువలో పడేయడంతో కాలువ కలుషితంగా మారింది. మోగల్లు గ్రామంతోపాటు కాలువను చేర్చి ఉన్న గ్రామాల వారు పంట కాలువలో మూటల్లో కొట్టుకు వస్తున్న కోళ్ల వ్యర్థాలతో ఆ ప్రాంత వాసులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తణుకు, అత్తిలి గ్రామాల మీదుగా కొన్ని రోజులుగా వేలాది కోళ్లు బర్డ్ ఫ్లూ బారిన పడి మృత్యువాత చెందడంతో అటు కోళ్ల యజమానులు మృతి చెందిన కోళ్లను సంచుల్లో మూటలు కట్టి పంట కాలువలో పడేస్తున్నారు. రేలంగి ఛానల్‌కు శివారుగా ఉన్న మోగల్లు గ్రామంలో వంతెన వద్ద వందలాది మూటలు పేరుకు పోయి ఆ ప్రాంత వాసులను బెంబేలు పెడుతున్నాయి. అధికారులు స్పందించాలని మోగల్లు ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న జరిగే పోలింగ్ ప్రక్రియను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై ఏలూరు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డితో కలిసి శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ నెల 27న పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం, వెబ్‌కాస్టింగ్, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించడంపై ఆరా తీశారు. దీనికి రిసెప్షన్ సెంటర్లు, రూట్ అధికారులు,పోలీస్ బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, బ్యాలెట్ పేపర్లు ఏర్పాట్లపైన చర్చించారు. ఏలూరు జిల్లాలో 87 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్చి 3వ తేదీన నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు.

విజిబుల్ పోలీసింగ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శుక్రవారం సాయంత్రం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, కూడళ్ళల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేసి ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్సు కల్గి ఉండాలని, వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు వాహనంతోపాటే ఉండాలన్నారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్‌ను భారంగా భావించవద్దని ప్రాణాలు కాపాడే రక్షక కవచమని సూచించారు. సరైన రికార్డులు లేనివలువరికి ఇ చలానాలు విధించారు.

28 లోపు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఏలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సర్వీస్ పెన్షనర్లు ఈ నెల 28వ తేదీలోగా వార్షిక ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్)ను జిల్లా ఖజానా కార్యాలయంలో సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల శాఖాధికారి టి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి స్వీకరిస్తున్నామని, పెన్షన్ దారులందరూ వారికి సమీపంలోని ఖజానా కార్యాలయం, మీ సేవ కేంద్రాలు, బ్యాంకులు, ఇంటర్నెట్ సెంటర్లల్లో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

హిందూ దేవుళ్లను కించపరుస్తున్న హెచ్‌ఎం

విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను విచారిస్తున్న మండల విద్యాశాఖాధికారులు, లక్కవరం ఎస్సై

ఏలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు బోధించవలసిన ప్రధానోపాధ్యాయుడు హిందూ దేవుళ్లను కించపరచడం, విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుండడంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామం రెడ్డిపేటలోని ప్రాథమిక పాఠశాలలో బి.సుబ్రహ్మణ్యం ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కొంత కాలం క్రితం ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం పాఠశాలలో విద్యార్థుల వద్ద హిందూ దేవుళ్ళ పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. విషయం తెలుసుకుని గ్రామ పెద్దల ద్వారా ప్రధానోపాధ్యాయుడిని మందలించామని ఎంఈవోకు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాకుండా విద్యార్థినుల పట్ల అనుచి తంగా ప్రవ ర్తి స్తు న్నా డ న్నా రు. హిందూ సాంప్రదాయానికి చెందిన విద్యార్థులు అధికంగా ఉన్న ఈ పాఠశాలలో పదే పదే హిందూ దేవతలను అవమానించేవాడన్నారు. హాజరు పట్టీల మీద ప్రైజ్ దలార్డ్, జీసస్ సేవ్స్ అని రాయడం, క్రైస్తవ క్యాలెండర్లను పాఠ శాలలో ఉంచడం చేసేవాడన్నారు. శివమాల, అయ్యప్ప మాల, హనుమాన్ మాల వేసుకున్న పిల్లలతో బవంతంగా గుడ్డు తినిపించేవాడని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మండల విద్యాశాఖాధికారులు బి.రాముడు, జి.రాములు పాఠశాలకు చేరుకుని విచారించారు. తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదును, తమ విచారణ రిపోర్టును జిల్లా విద్యాశాఖాధికారికి పంపుతామన్నారు. లక్కవరం ఎస్సై శశాంక, గ్రామ పెద్దలు, పలు హిందూ సంఘాల ప్రతినిధులు ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వస్తున్నారని తెలుసుకున్న హెచ్‌ఎం పాఠశాలకు సెలవు పెట్టాడని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తున్నారంటూ ఫిర్యాదు



జీలుగుమిల్లి, ఫిబ్రవరి, 14: (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అసత్యాన్ని ముద్రిస్తున్న ఆంగ్ల పత్రికపై చర్యలు తీసుకోవాలని పోలవరం నియోజకవర్గ జనసేన నాయకులు, గిరిజన నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సై పి.నవీన్ కుమార్‌లకు ఫిర్యాదు అందజేశారు. అసత్య ప్రచారాలు విరమించకపోతే జనసేన 7 మండలాల గిరిజన నాయకులు తగు చర్యలకు సిద్ధమన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్, మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ములిశెట్టి యుగంధర్, మెట్ట బుచ్చిరాజు, అడప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటంతో ఎమ్మెల్యే చిర్రి, బొరగం భేటీ



కరాటంతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, బొరగం శ్రీనివాస్

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబుతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ భేటీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం జంగారెడ్డిగూడెంలోని కరాటం థియేటర్ వద్ద భేటీ అయ్యారు. సుమారు రెండుగంటల పాటు ఈ ముగ్గురు సమావేశం కావడం విశేషం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత సేపు ముగ్గురు సమావేశం కావడం ఇదే మొదటిసారి. అయితే ఇటీవల కొన్ని రోజులుగా ఎమ్మెల్యే బాలరాజుపై ఒక ఇంగ్లీష్ పత్రికలో పలు వార్తలు వెలువడ్డాయి. దీనిపై నియోజకవర్గంలో చర్చనీయాంశం అయ్యింది. ఈ ముగ్గురు భేటి దీని వల్లనేనని అనుకుం టున్నారు. సమావేశంపై కరాటంతో మాట్లాడగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిశామని అదే విధంగా కూటమి అభ్యర్థి రాజశేఖరం విజయం కోసం సమావేశం అయ్యామని తెలిపారు.

నీటిపై రాతల్లాంటివి బొరగం

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పై వస్తున్న వార్తలు నీటి పై వార్తల్లాంటివని నియోజకవర్గ ప్రజలు ఎవరూ పట్టించుకోవల్సిన అవసరం లేదని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఇటువంటి వార్తలు సహజంగా వస్తుంటాయని అన్నారు.

గడ్డి తెచ్చేందుకు వెళ్లిన యువకుడి మృత్యువాత

పెదపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం ఏపూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణా జిల్లా కానుమోలుకు చెందిన కూరపాటి భువనేష్ (30) గడ్డి తీసుకువచ్చేందుకు ట్రాక్టరుపై వెళ్లాడు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ట్రాక్టరు ఏపూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టరుపై నుంచి కింద పడ్డాడు. తలకు గాయం కావడంతో తొలుత స్థానికంగా ఆసుపత్రికి అనంతరం పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద పాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి పాలకొల్లు వాసి ఆత్మహత్య

టెక్కలిలో ఘటన



టెక్కలి, ఫిబ్ర వరి 14 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాకు ళం జిల్లా టెక్కలి సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో కుక్‌గా పనిచేస్తున్న పాలకొల్లు ప్రాంతానికి చెందిన చందనాన స్వామి(45) శుక్రవారం జాతీయరహదారి పక్కన ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం రిజర్వాయర్‌లో మృతదేహం తేలిఉండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం అందింది. ఈమేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని బయ టకు తీశారు. చందనాన స్వామి టెక్కలి సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో కుక్‌గా పని చేస్తున్నాడని, ఇటీవలే ఆయనకు భార్యతో విడాకులు అయ్యాయని, మానసికంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని వారి బంధువులు తెలిపారు. ఈ మేరకు సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కర్రతో దాడి

భీమడోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటనపై భీమడోలు పోలీసులు కేను నమోదు చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక లింగంపాడు గ్రామానికి చెందిన తుమ్మల జ్యోత్స్నకు శ్రీను అనే వ్యక్తితో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తల విభేదాల కారణంగా వరకట్నం కేసు నమోదు అయ్యింది.దీంతో శుక్రవారం నాడు ఉదయం ఫిర్యాది హైదరాబాదు నుంచి తన ఇంటికి రాగా లింగంపాడు లోని తన తండ్రిని తీసుకు వెళ్ళేందుకు మోటారు సైకిల్ తీసుకు రమ్మని కోరగా రైల్వే గేటు సమీపంలో ఫిర్యాది భర్త కర్రతో తలపై బలంగా మోదడంతో రక్త గాయమైనట్లు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో పాటు జ్యోత్స్న ఇచ్చిన స్టేట్ మెంట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒక బాలుడు మృతి చెందిన సంఘటన భీమవరం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం గులాబీ సెంటర్ వద్ద జనవరి 12వ తేదీన బొర్రా కోటేశ్వరరావు (10) అనే బాలుడు పట్టణంలోకి వచ్చి బట్టల సంచితో ఇంటికి తిరిగి వెళుతున్నాడు. సరిగ్గా గులాబీ సెంటర్ వద్దకు వెళ్ళేసరికి పక్క నుంచి వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు కొక్కెమ్ బాలుడు సంచికి తగలడంతో బాలుడిని కొంత దూరం లాక్కెళ్ళిపోయింది. తీవ్ర గాయాలైన బాలుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13వ తేదీన మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై తండ్రి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

పాల కోసం వెళ్లి పామును తొక్కాడు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున పశువుల దగ్గర పాలు తీసేందుకు వెళ్లిన వ్యక్తిని పాము కాటువేయడంతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదతాడేపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాసరావు (46) శుక్రవారం తెల్లవారు జామున ఇంటిపక్కనే ఉన్న పశువుల పాక దగ్గర పాలుతీసేందుకు వెళ్లాడు. అక్కడ గడ్డిలో ఉన్న పామును తొక్కడంతో కాటు వేసింది. అది గమనించకుండా పాలుతీసి ఇంటికి వెళ్లిన శ్రీనివాసరావు విషం శరీరమంతా పాకి మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి.

'పది' పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్స్ దూరవిద్య విద్యార్థులకు ఏకకాలంలో నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ బస్సుల రాకపోకల సమయాలను రీషెడ్యూల్ చేసి, సంబంధిత సమయాలను ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం విద్య, విద్యుత్, పోలీసు, తపాలా, మున్సిపల్, రెవెన్యూ, వైద్య, రవాణాశాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. మార్చి 17 నుంచి ప్రారంభయ్యే పరీక్షల్లో ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా తగినంతమంది తనిఖీ అధికారులతో కూడిన బృందాలను నియమించాలన్నారు.

అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్ స్వాధీనం

దెందులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్ లారీని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, పలువురు జనసేన, బీజేపీ నాయకులతో కలిసి అడ్డుకున్నారు. సోమవరప్పాడు పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం కంటైనర్‌పై అనుమానం వచ్చింది. దీంతో నూజివీడు డీస్పీకి ఫోన్‌లో గుమ్మడి చైతన్య సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఎక్కడకు తరలిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేపట్టారు.

బస్టాండ్, మినీ బస్టాప్‌ల రూపురేఖలు మారుస్తా

లింగపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న అన్ని బస్టాండ్‌లు, మినీ బస్టాప్‌ల రూపురేఖలు మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని విజయనగరం ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన ఆయన లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పర్యటించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సహకారంతో నిరుపయోగంగా ఉన్న బస్ కాంప్లెక్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పాతూరి శ్రీనివాసరావు, గారపాటి బుజ్జయ్య, సి.హెచ్.రామ్మోహన్‌రావు, పల్లి శ్రీను, మోరంపూడి వర ప్రసాద్, నాగమణి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం రూపొందించాలి

చింతలపూడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం రూపొందించాలని సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మల్లాయిగూడెంలో కౌలు రైతుల సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో 70శాతం కౌలు రైతులే పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు.వారికి తగిన గుర్తింపు కార్డులివ్వడానికి యజమాని ఒప్పందం అనే నిబంధనను తొలగించాలన్నారు.ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ, ఆర్.లక్ష్మణరావు, కంచర్ల గురవయ్య, టి.బాబు, తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ క్లాప్ ఆటో డ్రైవర్ల నిరసన

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ఆకలితో అలమటిస్తున్నాం భిక్షం వేయండంటూ క్లాప్ ఆటోడ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి వన్ టౌన్‌లో పలు వీధుల్లో తిరిగి భిక్షాటన చేశారు. ఉన్నట్టుండి ఆకస్మాత్తుగా ఉద్యోగాలు పీకేస్తే ఎలా బతకాలని యూనియన్ నాయకులు అచ్యూత్ కుమార్ అంబేద్కర్ ప్రశ్నించారు. ఇప్పటికైన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని నగర కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. నూకరాజు, విజయ్, సాయి, శ్రీనివాస్, గణేష్, రాజు, కిషోర్, జయరామ్, నవీన్, నాగ వెంకటేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

లింగపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాలలో జరగనున్న టెన్నికాయిట్ పోటీలకు లింగపాలెం మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో కె.వంశీ, బి.చంటిబాబు, ఎం.పవన్ కుమార్, ఎం.రాజు, ఏ వంశీ, మహిళల విభాగంలో కె.మౌనిక, ఎస్.డి.హసీనా, జి.సత్యయామిని, టి.జ్యోత్స్నిత ఎంపికైనట్టు పీఈటీ సి.హెచ్.సి.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో గోపాలపురం మండలం చిట్యాలలో జరగనున్న సీనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు వెయిట్‌లిఫింగ్ కోచ్ బి.శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకాష్ రెడ్డిని ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం బలోపేతమవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

చింతలపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ బలోపేతం కావాలని జిల్లా ప్రైవేటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. స్థానిక మెరక వీధిలో మండల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు సంఘంలో సభ్యులుగా నమోదై బలోపేతమైతే సభ్యులకు మంచిదని, నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అన్నవరపు రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలు మహేంద్ర, కోశాధికారి సత్యకుమార్, కార్యదర్శి సతీష్ పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో రాఘవాపురం, ప్రగడవరం, టి.నర్సాపురం గ్రామాల నుండి సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు, మహిళలకు హెపటైటిస్ పరీక్షలు

భీమడోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ట్రాన్స్ జెండర్లకు, బలహీన వర్గాల మహిళలకు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఏఆర్టీ కేంద్రంలో హెపటైటిస్ బి, సి పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్లు వేశారు. స్థానిక వైద్యులు సునీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రోగామ్ మేనేజర్ బాలాజీ హెపటైటిస్ బి వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేసే ఈ ఉచిత పరీక్షలను, వ్యాక్సిన్‌ను సద్వినియోగపర్చుకోవాలన్నారు. జిల్లా సూపర్ వైజర్ హరనాథ్ కుమార్, వైద్య సిబ్బంది శైలజ, సింహాద్రి, పాపారావు, శిరీష పాల్గొన్నారు.

26 నుంచి వీరేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఏలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో ఉన్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కరపత్రాలను శుక్రవారం చింతలపూడి కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పిన్నమనేని నాని, ఎస్.ఇస్మాయిల్, పొన్నగంటి అనిల్, రూపా సుధాకర్ పాల్గొన్నారు.

అకస్మాత్తుగా పడిపోయిన ఆర్టీసీ డ్రైవర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : డ్యూటీకి వచ్చిన ఒక ఆర్టీసీ డ్రైవర్ అకస్మాత్తుగా పడిపోవడంతో అతనిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఏలూరు డిపోకు చెందిన డ్రైవర్ ఆర్.జి.రావు శుక్రవారం ఉదయం యధావిధిగా డ్యూటీకి వచ్చారు. బస్సును నాన్‌స్టాప్ పాయింట్లో పెట్టి టిక్కెట్లు మిషన్ కోసం లోపలకు వెళ్లి అక్కడే పడిపోయారు. గతంలో తలకు ఆపరేషన్ చేయించుకున్నారని, అదే సమస్య ఉత్పన్నమవడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని సిబ్బంది తెలిపారు.

రైతులంతా పేర్లు నమోదు చేయించుకోవాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసి సేవలు మరింత సులభతరం చేసేందుకు రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో అందించనుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా తెలిపారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులోని రైతుసేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భూమి ఉన్న ప్రతి రైతుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ కార్డు అందించనున్నామని అన్నారు. సొంత భూమి ఉన్న ప్రతి ఒక్కరూ రైతుసేవా కేంద్రాల్లో తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కె.డి.ఏ వై.సుబ్బారావు, ఎంఏవో ఏ.జీవన సంధ్య, గ్రామ వ్యవసాయ శాఖ అధికారిణి ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధి పథకాలపై అవగాహన

పెదపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : సంచార జాతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ గోసాల ఝాన్సీరాణి తెలిపారు. పెదపాడు మండలం కొత్తూరులో సంచార జాతుల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ సంప్రదాయం ప్రకారం జీవనం సాగించినప్పటికీ పిల్లలను చదివించడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కో-ఆర్డినేటర్ శిరోమణి మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు వారి ఆసక్తి బట్టి శిక్షణ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ముత్యాలకుమారి, పెద్దింట్లు, చుక్కమ్మ, చిన్నారి పాల్గొన్నారు.

గ్రామాలకు నూతన శోభ



కాట్లంపూడిలో పూర్తయిన సీసీ రోడ్డు

ఏలూరు రూరల్ మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం - చేపట్టిన పనుల్లో 80 శాతం పూర్తి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్ల పనులు పూర్తవడంతో గ్రామాలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సరైన మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్లపైనే మురుగు పారేది. కూటమి ప్రభుత్వంలో దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు రూరల్ మండలంలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు వేగం పుంజుకుంటున్నాయి. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. సుమారు 3.04 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు లేక డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. వైసీపీ పోయి కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామాల్లో సీసీ రోడ్లకు మోక్షం లభించింది. చేపట్టిన రోడ్ల పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వంలో కొనసాగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం : పంచాయతీరాజ్ ఏఈ, మురళీకృష్ణ

మండలంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనుల విషయంలో నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు. కాంట్రాక్టర్లకు చెప్పి ముమ్మరంగా పనులు కొనసాగిస్తున్నాం. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని శాయశక్తులా కృషి చేస్తున్నాం.

పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హుల ఏరివేత...

అర్హులైన దివ్యాంగులంతా పింఛన్లు పొందాలనే ఉద్దేశంతో నకిలీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అనర్హులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆయా గ్రామాల్లో పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను పరిశీలించి అర్హతను నిర్ధారించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు దళారుల అవతారమెత్తి పలుకుబడితో పైస్థాయి నాయకుల ద్వారా అనర్హులకు పింఛన్లు ఇప్పించారు. ప్రస్తుతం లింగపాలెం మండలంలో 1,007 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతుండగా వారిలో అనర్హులను గుర్తించి తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంచానికే పరిమితమయ్యి ప్రతి నెలా 15 వేల రూపాయలు పింఛన్ రూపంలో పొందుతున్న వారిని ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ డాక్టర్లతో పాటు డిజిటల్ అసిస్టెంట్, గ్రామ స్థాయి అధికారులు పరిశీలిస్తున్నారు. గుర్తించిన వారిని నూజివీడులోని ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌కు పంపి ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయిస్తున్నారు. అధికారుల తనిఖీల్లో ఇప్పటికే దివ్యాంగ పింఛన్లు పొందుతున్న కొంద రిని అనర్హులను గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

– లింగపాలెం,(ఆంధ్రజ్యోతి)



లబ్ధిదారులను పరిశీలిస్తున్న అధికారులు

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం ప్రచారం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రాజశేఖరంను గెలిపించాలంటూ నగరంలో టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ గత 8 నెలల కూటమి పాలన విశ్వసనీయతకు ప్రజలు మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టంకట్టబోతున్నారని అన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలలో ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసే పని తీరును వివరించారు. ఉద్యోగులందర్నీ వ్యక్తిగతంగా కలిసి ఓటును అభ్యర్థించారు. ప్రజల స్పందన చూస్తుంటే రాజశేఖరం గెలుపు నల్లేరుమీద నడకేనన్నారు. విద్యావంతులు పూర్తి అవగాహనతో ఓటు వేస్తారని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు షేక్ మీరావలి, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు.

కె.కోటలో టీడీపీ ఇంటింటి ప్రచారం

కామవరపుకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి, గ్రామ కమిటీ అధ్యక్షులు యలమర్తి రాంబాబు, వజీర్ ఖాన్, నెక్కలపూడి మల్లికార్జునరావు, తూంపాటి అబ్రహం ఉన్నారు.



ఆడమిల్లిలో మాజీ ఎమ్మెల్యే మురళీ ప్రచారం

ఉంగుటూరు మండలంలో ప్రచారం

ఉంగుటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉంగుటూరు మండలంలోని ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ప్రచారం నిర్వహించారు.

ఎస్పీ దృష్టికి పోలీస్ సిబ్బంది సమస్యలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సిబ్బందికి ఉన్న శాఖాపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. సివిల్ పోలీస్, ఎ.ఆర్. పోలీస్, హోంగార్డ్సు నుంచి శుక్రవారం ఏలూరు ఎస్పీ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకు పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వాహన బీమాపై అవగాహన కల్పించండి : డీటీసీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వాహన బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం బీమా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మోటారు వాహనాలు, బీమా కంపెనీల ఉద్యోగులతో, సర్వేయర్స్‌తో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అదే సమయంలో ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు చనిపోయిన వారి లోటు తీర్చలేకపోయినా, వారి కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా మోటార్ వాహనాల బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధుల సందేహాలను ఉపరవాణా కమిషనర్ షేక్ కరీం నివృత్తి చేశారు. దానితో పాటు రహదారి భద్రతలో వారిని భాగస్వాములను చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లాలోని ఇన్సూరెన్సు కంపెనీ ఉద్యోగులు, సర్వేయర్లు ఆర్టీవో కృష్ణారావు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు బి.భీమారావు, బి.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పెదవేగిలో మాట్లాడుతున్న ఏసీడీపీవో రాజశేఖర్



దెందులూరులో జరుగుతున్న శిక్షణ తరగతులు

అంగన్‌వాడీల్లో పోషకాహారంపై అవగాహన

దెందులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లో చిన్నారులకు పోషకాహారం అందించి ఆటపాటలతో విద్యను బోధించాలని ఏలూరు జిల్లా ప్రాజెక్టు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పీడీ శారదా అన్నారు. శుక్రవారం దెందులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు చిన్నారుల పోషణ, విద్య అనే అంశంపై అవగాహన కల్పించారు. సీడీపీవో విజయలక్ష్మి పాల్గొని అంగన్‌వాడీల్లో చిన్నారులు మానసికంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ఏం చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టమ్మ, పద్మ భూషణం, శ్రీదేవి పాల్గొన్నారు.

పెదవేగిలో ఏసీడీపీవో సూచనలు

పెదవేగి : చిన్నారుల అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఐదంచెల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మహిళా శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా పెదవేగిలో జరుగుతున్న శిక్షణ తరగతులకు హాజరైన సునీల్ రాజశేఖర్ ఐదంచెల కార్యక్రమంపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీల్లోని ఐదేళ్లలోపు చిన్నారులను సంపూర్ణ పోషణ, విద్యలో తీర్చిదిద్దేలా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పెదవేగి, విజయరాయి, కొప్పాక సెక్టార్ల సూపర్ వైజర్లు సి.హెచ్. పార్వతి, మేరీబాయి, శాంతారత్నం, ఆయా మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి..

టి.నరసాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. మూడు రోజులు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో 66మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నట్టు ఆమె తెలిపారు.



నివాళులర్పిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

దామోదరం సంజీవయ్య జయంతి

కామవరపుకోట/ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంయుక్తంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం భీమరాజు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బిరుదుగడ్డ నాగేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థులకు సంజీవయ్య గొప్పతనాన్ని వివరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపల్ కె.విజయబాబు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, దరావతు మల్లేష్ పాల్గొన్నారు.ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరిబాబు అధ్యక్షతన సంజీవయ్య జయంతిని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకట దుర్గాప్రసాద్, అధ్యాపకులు పరమేశ, విజయ కుమార్, కావ్యశ్రీ, సుస్మలత, సుజాత తదితరులు దామోదరం చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం : జేసీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికి ఆదర్శప్రాయులని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత విలువలకు మారుపేరు అయిన దామోదరం సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. వారి జయంతిని అధికారికంగా జరుపుకోవడం అందరికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘికసంక్షేమశాఖ జేడి జయప్రకాష్, సెట్‌వెల్ సిఈవో ప్రభాకర్, బీసీసంక్షేమ శాఖ అధికారిణి ఆర్.వి నాగరాణి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల వార్షిక సమావేశం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ వార్షిక సమావేశం జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పడి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.సంఘ అధ్యక్షులు వీరభద్రరావు, వై.వేళాంగిణి, ఎన్.ప్రజారాజ్యం, సూర్యనారాయణ, ఎంఎ.రజాక్, ఎస్.శాకుంతలమ్మ, వీరయ్య, ఆశీర్వాదంలను ఘనంగా సన్మానించారు.

బొర్రంపాలెంలో ఆలయ వార్షికోత్సవం

టి.నరసాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెంలో కనకదుర్గమ్మ ఆలయ 34వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రెండో రోజు వైద్య శిబిరాలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాదంపూడి గ్రామంలోని ఓ ఫౌల్ట్రీలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజ్ మనోజ్ సమక్షంలో కార్యదర్శి కాకర్ల గిరిధర్ ఆధ్వర్యంలో శుక్రవారం కూడా సూపర్ శానిటేషన్ చేయించారు. అలాగే 4 వైద్య శిబిరాల్లో 42 మందికి రక్త నమూనాలను సేకరించి పరీక్షించగా ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అంబికాదేవికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాఘ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనను జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ జరిపారు.

వీరభద్ర స్వామికి పూజలు

కామవరపుకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : భద్రకాళీ సహిత వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అభిషేకాలు, బిల్వార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కాల్వలను ప్రైవేటుపరం చేయొద్దు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : పంట కాలువల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశాన్ని ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విధానం సరికాదని, సీఎం చంద్రబాబు పునరాలోచించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు పలువురు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం జరిగిన పరీక్షలకు 1129మంది విద్యార్థులకు 1107మంది, మధ్యాహ్నం 1311మందికి 1275మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఏలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డి గూడెం మండలం లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగులగూడెం శివారులో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదు పులోకి తీసుకుని వారి నుంచి లక్షా 4వేల 890 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శశాంక తెలిపారు.

ఆలయానికి ఏసీ బహూకరణ

పోలవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో స్థానిక భక్తాంజనేయస్వామి ఆలయానికి జంగారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఆకుల అప్పారావు, ధనలక్ష్మి దంపతులు శుక్రవారం ఏసీని బహూకరించారు. ఆలయ అర్చకులు పైడిపల్లి ఫణి కుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు నంగినీడి బాలకృష్ణ, యెక్కిశెట్టి వెంకట రాజా, ప్రసాద్, కొణతాల ప్రసాద్, బండి శ్రీను తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి : డీఎస్పీ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుకునే వయసులో తప్పుడు మార్గంలో వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మైనార్టీ తీరని కొంతమంది ప్రేమ పేరుతో మోసపోతూ తల్లిదండ్రులను బాధ పెడుతున్నారని అన్నారు. జీలుగుమిల్లి స్టేషన్‌లో నేర సమీక్షను డివిజన్ స్థాయిలో శుక్రవారం నిర్వహించారు. పలు కేసుల వివరాలు పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సమస్యల్ని సున్నితంగా పరిష్కరించాలని, శాంతి భద్రతల్ని కాపాడాలని, భూ సమస్యలు తలెత్తకుండా చూడాలని, సిబ్బందికి సూచనలు చేశారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. సీఐలు బాలసురేష్ బాబు, సురేష్, వెంకటేశ్వరరావు, ఎస్సై నవీన్ కుమార్, చంద్రశేఖర్ ఉన్నారు.



నేరాలపై సమీక్ష నిర్వహిస్తున్న పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరరావు



కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కామినేని, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి

'ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించండి'

కైకలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి కోరారు. కైకలూరులో ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులను కూటమి నేతలు శుక్రవారం కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఏఎస్ మాల్యాద్రి, కోకన్వీనర్ తేరా రమేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. వడాలి, పెదగొన్నూరు గ్రామాల్లో ఆయన కూటమి నాయకులతో పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు. పెదగొన్నూరులో గుడివాడ వేణు, నాగిరెడ్డి శివ ప్రసాద్, తాడంకి రాజేష్, డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్ ఓట్లు అభ్యర్థించారు.

నేరాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం

కైకలూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు, నేరాలను నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, తదితర దుకాణాల వద్ద శుక్రవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో సీసీ కెమెరాల నిఘాతో పాటు రాత్రి సమయాల్లో గస్తీ పెట్టుకునే విధంగా దుకాణ యజమానులు సహకరించాల న్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మరిన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తామన్నారు. ఎస్సైలు వెంకటకుమార్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వం జూనియర్ కాలేజీ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

లంచం..ఇస్తేనే సాగు

- సన్న, చిన్నకారు రైతుల్ని పీక్కుతింటున్న ఓ ఫారెస్టు ఆఫీసర్
- ఎంత లంచం ఇచ్చినా చాలడం లేదంటూ డిమాండ్
- లంచగొండి అధికారిపై చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు



లంచగొండిలపై చర్యలు తీసుకోవాలి

మా అన్నదమ్ములకు అంతా కలిపి 5.5 ఎకరాల భూమి ఉన్నది. మా అన్నగారి అమ్మాయికి దీని నుంచి ఒక ఎకరం భూమి కట్నంగా ఇచ్చాం. ఈ భూమికి సాగు లేక ఆదాయం లేక కాపురంలో కలతలు కూడా వచ్చాయి. మగతా కోసం గొడవలు పడడంతో పెద్దల మధ్య సఖ్యత కుదిర్చి ఆ మగ తా సొమ్ము మా అన్న కుటుంబం కూలిపని చేసుకొంటూ కౌలు చెల్లిస్తున్నారు. పొలం సాగైతే బాగుంటుందని భావించి ఫారెస్టు ఆఫీసురు అడిగిన రూ.30వేలు ఫిబ్రవరి 6వ తేదీన లంచం ఇచ్చాం. మరలా సొమ్ములు చాల్లేదని అడగటంతో ఫిబ్రవరి 10న మరో 10 వేలు ఫోన్‌పే చేశాం. ఇంకా చాలదంటూ రోజు హింసిస్తున్నాడు. మా జిరాయితీ భూముల్లో సాగుకు అనుమతి ఇవ్వాలి.

- మండా పోలయ్య, రైతు, నిడమర్రు



పొలం ఉండి కూలికి వెళుతున్నా..

20 ఏళ్ళుగా నాకున్న 2 ఎకరాల భూమిని సాగు చేయలేకపోయాను. మా పొల్లాలన్నీ ఉప్పునీటి కయ్యలు అయ్యా యి. సొంత పొలం ఉండి కూలీపనులకు వెళ్లాల్సి వస్తోంది. నా భూమిలో సాగు కోసం ఫారెస్టు వారు లంచం డిమాండ్ చేస్తున్నారు. మమ్మల్ని మానసికంగా హింసిస్తున్నారు.

- పల్లా నాగేశ్వరరావు, రైతు, నిడమర్రు

నిడమర్రు ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు జిరాయితీ భూముల్లో సంప్రదాయ సాగు చేసుకోవడానికి అనుమతి కోసం వేడుకుంటుంటే లంచాలు డిమాండ్ చేస్తూ మానసిన క్షోభకు గురిచేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామం వెంకటాపురంలో సుమారు 200 మంది పైచిలుకు సన్న, చిన్నకారు రైతులకు 600 ఎకరాలు కొల్లేరు జిరాయితీ భూమి ఉంది. తాతల కాలం నుంచి కొల్లేరు భూములపై ఆధారపడి సంప్రదాయ వ్యవసాయ సాగు చేస్తూ తమ కుటుంబాలను పోషించేవారు. కాలం గడుస్తున్న కొద్దీ కొల్లేరు అన్‌సర్వే భూముల్లో ఇష్టారాజ్యంగా రొయ్యలు, చేపల చెరువుల తవ్వకం వలన వ్యవసాయ పొల్లాల్లో ఉప్పు నీరు చేరిపోయి సాగుకు ఆటంకం ఏర్పడింది. రైతులు తమ పొలాలను వదిలి ఏమి చేయలేక కూలీనాలీ చేసుకొని బతువెళ్లదీస్తున్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో జిరాయితీ భూములలో చెరువులను ధ్వంసం చేశారు. కానీ రైతులకు నష్టపరిహారం అందివ్వలేదు. అయితే గత ఏడాది రైతులు సాగుకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో సాగుకు అనుమతి ఇవ్వాలంటే లంచం ఇవ్వాలనే డిమాండ్ అధికారుల నుంచి వచ్చింది.

రైతులపై బైండోవర్ కేసులు

గత 18 ఏళ్ళగా తమ భూమి పనికి రాకుండా బీడు భూములుగా మారాయని, దీని వల్ల తమకు ఆదాయం లేకుండా పోతుందని రైతులందరూ మూకుమ్మడిగా 2024 మార్చినెలలో తమ జిరాయితీ భూములను సాగుచేయడానికి ట్రాక్టర్లతో ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు తమ బెటాలియన్‌తో వచ్చి రైతుల ప్రయత్నాలను అడ్డుకొని వారికి నోటీసులు ఇచ్చి బైండోవర్ కేసులు పెట్టారని వాపోయారు. దీంతో రైతులు జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది.

సాగు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే..

గత సంవత్సరం నిలుపుదల చేసిన భూముల్లో సాగు నిమిత్తం అంతా తానే చూసుకొంటానంటూ ఏలూరు జిల్లా ఫారెస్టురేంజ్ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నబిగరి శ్రీనివాసబాబు రైతులతో లంచాల రాయబారం నడిపాడు. తొలుత ఎకరానికి రూ.30 వేలు ఇస్తే సాగుచేసుకోవచ్చని రైతులను నమ్మబలికాడు. ఆ మాటలు నమ్మి చాలా మంది రైతులు కొంతమొత్తంలో సొమ్ములు కూడా చెల్లించారు. మరో దఫాగా మరో రూ.10 వేలు డబ్బులు డిమాండ్ చేయగా రైతు మండా పోలయ్య రూ.10 వేలు లంచంగా ఆ ఉద్యోగి సొంత నెంబరుకు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఇదీ చాలదంటూ మరో రూ.10వేల డిమాండ్ చేస్తున్నాడని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేసేది లేక మీడియాను ఆశ్రయించామని రైతులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు ఇవ్వాలంటూ ఒత్తిడి

తాను జిల్లా కార్యాలయ ఉద్యోగినని, తన చేతిలో ఉన్నతాధికారులు ఉన్నారని, తానుఏమి చెబితే వారు అదే చేస్తారని రైతులను నమ్మబలికాడు. తాను ఏలూరు జిల్లా ఫారెస్టు ఆఫీసును చూసుకొంటానని, తనకు సొమ్ములు ముట్టచెబితే ఉన్నతాధికారులకు మామూళ్ళు సమర్పించి మీ పని మూడోకంటికి తెలియకుండా చేస్తానని మాయ మాటలు చెప్పాడు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసు బాబుకు లంచం ఇచ్చిన సొమ్ము సి.సి.పుటేజ్‌లు, ఫొటోలతో సహా ఉన్నాయని, ఫోన్‌పే రసీదులు కూడా తమ వద్ద ఉన్నాయని రైతులు చెబుతున్నారు.



సి.సి. పుటేజీలో లంచం ఇస్తున్న దృశ్యం

విచారణ చేపడతాం

బి.విజయ, డీఎఫ్‌వో (వైల్డ్ లైఫ్) ఏలూరు జిల్లా

అటవీ సిబ్బందిపై లంచం ఆరోప ణలు ఇప్పుడే తన దృష్టికి వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతాం. ఆరోపణలు నిజ మని తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటాం. లంచం తీసుకోవడం చట్టరీత్యా నేరం.

ఈ రోడ్డులో ప్రయాణం నరకమే!

- అధ్వానంగా గుడివాడ - మానికొండ రహదారి
- విజయవాడ వెళ్లేందుకు వాహనదారుల పాట్లు
- ముదినేపల్లి నుంచి ప్రత్యామ్నాయ రోడ్లే గతి

ముదినేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో పాటు, విజయవాడ వెళ్లేందుకు కైకలూరు నియోజకవర్గ ప్రాంత ప్రజలే కాక, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం వెళ్లే ప్రజలు సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతవాసులు ఎప్పటి నుంచో ముదినేపల్లి, గుడివాడ, మానికొండ, కంకిపాడు మీదుగా విజయ వాడ ఆపై ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే గుడి వాడ - మాని కొండ ప్రధాన రహదారి గోతులమయమై 30 కిలో మీటర్లు అధ్వానంగా మారడంతో వాహనాలు వెళ్లే వీలులేక ప్రత్యా మ్నా య మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డు అభివృద్ధిని గత 30 ఏళ్లగా పాలకులు విస్మరించారు. మానికొండ రోడ్డు పేరు చెబితే ఇప్పుడు జనం అమ్మో..ఆ రోడ్డా అని భయపడే పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా ఉన్న పలు గ్రామీణ రహ దారుల్లో వాహనాల రద్దీ పెరగడంతో అవి అధ్వానంగా మారాయి.

ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విజయవాడ, రాజధాని ప్రాంతానికి కార్లలో వెళ్లే వారు ముఖ్య కూడలి ప్రదేశమైన ముదినేపల్లి రావాల్సిందే. గుడివాడ - మానికొండ రోడ్డు దగ్గర మార్గమైనా గోతుల్లో వెళ్లలేక మచిలీపట్నం - విజయవాడ హైవేను చేరుకునేందుకు ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు మీదుగా అడ్డాడ, విన్నకోట నుంచి అంగలూరు మీదుగా వెళ్తున్నారు. కొన్ని ప్రాంతాల వారు మోటూరు రోడ్డు నుంచి సిద్ధాంతం అంగలూరు, గుడివాడ నుంచి పామర్రు, పెదపారుపూడి - యలమర్రు మీదుగా గోపువానిపాలెం, మరికొన్ని ప్రాంతాల వారు గుడివాడ - కంకిపాడు రూటులోని కలవపాముల - కాటూరు మీదుగా ఉయ్యూరు చుట్టూ తిరిగి హైవేను చేరు కోవాల్సి వస్తుంది. యలమర్రు వద్ద వంతెన కూలడంతో ఆ మార్గం బంద్ అయింది. విజయవాడలో ఉన్న పనులను బట్టి గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా కొంతమంది వెళ్తుంటే మరి కొందరు దూరం తగ్గుతుందని పుట్టగుంట నుంచి ఉంగుటూరు మీదుగా గన్నవరం హైవేకు చేరుకుంటున్నారు. ఈ రూటులోను ఐదు కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉంది. విజయవాడ ఆస్పత్రులకు వెళ్లే రోగులు గతుకుల రోడ్లలో అసౌకర్యానికి గురవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్లు కనీసం మరమ్మతు లకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించడంతో ఈ రోడ్లకు మోక్షం కలుగుతుందని స్థానికులు, వాహనదారులు ఆశిస్తున్నారు.



అధ్వానంగా గుడివాడ - మానికొండ రోడ్డు

గ్రామాల్లో క్యాన్సర్ సర్వే

కలిదిండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ సర్వే చేస్తున్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వైద్యఆరోగ్య బృందం ఇంటింటికి వెళ్లి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. మూల్లంక పీహెచ్‌సీ పరిధిలో పెదలంకలో శుక్రవారం వైద్యఆరోగ్య బృందం ఇంటింటికి వెళ్లి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు జాహ్నవి, హేమంత్, ఎంఎల్‌హెచ్‌పి జెన్నిఫర్, ఎంపీహెచ్‌ఏ మహాలక్ష్మి, ఆశా వర్కర్లు డి.పద్మ, కె.అంజలి, వనితా రాణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు తొలి దళిత ముఖ్యమంత్రిగా వ్యవహరించిన దామోదరం సంజీవయ్య చిత్రపటాలను ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగజగన్ బాబూరావు కోరారు. ముదినేపల్లిలోని దళిత సంఘాల కార్యాలయంలో శుక్రవారం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్య విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కోరారు. మాలహానాడు నాయకులు ముక్కు రాజేష్, దాకారపు జోజిబాబు, భూపతి అశోక్, పల్లెం రాజు, దాసరి మణి పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మండవల్లి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో నిర్మించిన షిర్డీ సాయిబాబా సంకీర్తన మందిరంలో ఈనెల 15 నుంచి 17 వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 17న బాబా విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జడ్పీ సీఈవో కన్నమనాయుడు

కైకలూరు/కలిదిండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు తెలిపారు. కైకలూరు మండలం పెంచికలమర్రు, కలిదిండి మండలం తాడినాడ, మండవల్లి మండలం తక్కెళ్ళపాడు సామూహిక రక్షిత మంచినీటి పథకాలను (సీపీడబ్ల్యూసీ) శుక్రవారం ఆయన పరిశీలించారు. సీపీడబ్ల్యూసీ స్కీం ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడంతో తాగునీరు సక్రమంగా అందడం లేదని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అత్యవసర పనులను గుర్తించి ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. తక్కెళ్ళపాడులో పాత మైక్రోఫిల్టర్ పనిచేయకపోవడంతో నెల రోజుల్లో కొత్తది ఏర్పాటు చేస్తామన్నారు. పెంచికలమర్రు మంచినీటి పథకంలో చెరువులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కైకలూరులో ఫిల్టర్‌బెడ్స్ పనిచేయకపోవడంపై ఆయన ఆరా తీశారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులను కేటాయించి వాటిని మరమ్మతు నిర్వహించాలని ఎంపీడీవో ఫణీంద్రను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కొండలరావు, ఏఈ డి.నాగబాబు, కలిదిండి ఎంపీడీవో కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వి.శ్రీనివాసరావు, ఏఈఈ కృష్ణారావు, కార్యదర్శి నస్రీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు వైఎస్సార్ కాలనీ శివారు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు అనుమతులు లేకుండా తొలగించారని, అయినప్పటికీ అక్కడ చెత్త నుంచి సంపద తయారీ నిర్వహిస్తున్నట్లు సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారని వార్డు సభ్యులు జడ్పీ సీఈవోకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరారు.



తాడినాడలో సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు

రైతులు విశిష్ఠ సంఖ్య పొందాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ఠ సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డులను ఈనెల 25లోగా పొందాలని ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా తెలిపారు. అప్పారావుపేటలో శుక్రవారం నిర్వహించిన గుర్తింపు కార్డుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశిష్ఠ సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డులు రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పిస్తాయన్నారు. ఏడీఏ జి.వెంకట మణి, ఏవో వేణు మాధవ్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



అప్పారావుపేటలో రైతు విశిష్ఠ సంఖ్యను నమోదు చేస్తున్న జేడీఏ హబీబ్ బాషా

ఇంటర్వ్యూ..

పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు



వీఎన్‌కే.శేఖర్, ఈవో

- **పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు?**

జవాబు : భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. క్యూ లైన్‌లో భక్తులకు మంచినీరు, మజ్జిగ అందిస్తాం. వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం.

- **ఉత్సవాలకు ఎంత మంది భక్తులు వస్తారని అంచనా?**

జవాబు : సుమారు లక్ష మంది వస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నాం.

- **స్వామివారి కల్యాణం, తెప్పోత్సవం ఏర్పాట్లు?**

జవాబు: ఈ నెల 24 నుంచి 28 వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయి. 25న స్వామివారి కళ్యాణం, 26న తెప్పోత్సవం నిర్వహిస్తాం. భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

- **సాంస్కృతిక కార్యక్రమాలు ?**

జవాబు : ప్రతీ రోజు సాయంత్రం సాంస్కృతిక, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం.

- **భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే కోనేరు వద్ద ఏర్పాట్లు?**

జవాబు : తాజా నీటితో కోనేరును నింపాం. గజ ఈతగాళ్ల ఏర్పాటు, కోనేరు లోపలకు వెళ్లకుండా ఫెన్సింగ్ వేశాం. మహిళలకు కోనేరు వద్ద ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం.

- కలిదిండి



చాట్రాయిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

'ఆలపాటి'కి ఓట్లు వేయాలని ప్రచారం

చాట్రాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ చాట్రాయిలో శుక్రవారం మండల టీడీపీ కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గద్దం ప్రభాకరరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

లక్ష్మణరావు విజయం కోరుతూ..

నూజివీడు టౌన్:గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కె.ఎస్ లక్ష్మణరావు విజయం కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నూజివీడు మండలం పల్లెర్లమూడి, సీతారాంపురం, మీర్జాపురంతదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.




ఎక్సైజ్ దాడులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం దేవరగుంట గ్రామంలో సారా తయారీకి నిల్వ ఉంచిన 400లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సబ్ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వర్‌రావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



విద్యార్థిని తండ్రికి చెక్కును అందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, విద్యార్థులు

మేమున్నాం.. తోటి విద్యార్థిని ఆస్పత్రి ఖర్చుకు వితరణ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.అనూష గత సంవత్సరం డిసెంబర్‌లో బ్రెయిన్ హేమరేజ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తరలించగా ఆమె వైద్యఖర్చులకు పెద్ద మొత్తంలో అవసరమైంది. దీంతో విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా తొలి విడతగా 2,30,000, అనంతరం లక్షా20వేలను అనూష తండ్రి ధనుంజయ్‌కు అందించారు. శుక్రవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో అనూష తండ్రి ధనుంజయ్‌కి లక్షా20వేలు చెక్కును నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ అందించారు. ప్రస్తుతం విద్యార్థిని వెంటిలేటర్‌పై ఉండగా, ఆమె ఆరోగ్యపరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. అనూష పరిస్థితిని విద్యార్థులు ఎక్స్ ద్వారా విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ సీఎం సహాయనిధి నుంచి దాదాపు రూ.12లక్షలను వైద్య సహాయానికి అందించింది. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు బ్రహ్మాస్వాములు, యోగా శిక్షకులు అక్కినేని సత్యశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్

నూజివీడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక శక్తివనరుల ఆధారంగా ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్ వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రముఖశాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.భగవాన్ నారాయణ అన్నారు. నూజివీడు ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శక్తివనరులు వాటి వినియోగంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భగవాన్ నారాయణ మాట్లాడుతూ శక్తివనరులు నానాటికి తగ్గుతున్న క్రమంలో పునరుద్పాదక శక్తివనరులను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టిపెట్టాయని, విద్యార్థులు సైతం తదనుగుణంగా అవసరమైన నైపుణ్యాల పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌ఆఫ్ అకడమిక్స్ చిరంజీవి, సెమినార్ కన్వీనర్ జి.దుర్గాబాబు, అసోసియేట్ ఆఫ్ అకడమిక్స్ కె.రఘుకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ భగవాన్ నారాయణ

సబ్ జోన్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

నూజివీడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సబ్‌జోన్ క్రీడాపోటీలను విజయవంతం చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్ళాలని నూజివీడు డివిజనల్ విద్యాశాఖ అధికారి సేవియ్యానాయక్ అన్నారు. నూజివీడులో వ్యాయామ ఉపాధ్యాయులతో సబ్‌జోన్ క్రీడాపోటీల పై ఆయన సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 21,22 తేదీల్లో నిర్వహిస్తున్న సబ్‌జోన్ క్రీడాపోటీలకు సంబంధించి క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివనాగేంద్రం, సుగుణరావు, లక్ష్మి, అన్నామణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో

సురక్షితంగా వాహనాన్ని నడపాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సురక్షితంగా వాహనాన్ని నడిపి ప్రయాణికుల కుటుంబాల క్షేమంతో పాటు తమ సొంత కుటుంబం క్షేమాన్ని కూడా వాహన చోదకులు ఆకాంక్షించాలని నూజివీడు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి జి.నాగమురళీ అన్నారు. నూజివీడు పట్టణంలో శుక్రవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు, యజమానులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం, మాదకద్రవ్యాలు సేవించి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సగ్గురు గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి యు.ప్రభాకరరావు చొరవ అభినందనీయం అని పాఠశాల ప్రధానోపాధ్యా యులు కె.అరుణ తెలిపారు. నూజివీడు మండలం ఎంపీపీఎస్ వేంపాడులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రభాకరరావు పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్స్, డ్రాయింగ్ బుక్స్ అందచేశారని తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ పదవి బాబికి కేటాయించాలి

చాట్రాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏఎంసీ చైర్మన్‌గా టీడీపీ దళిత నాయకుడు కొండేటి బాబీని నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మండల ఎమ్మార్పీఎస్ సమావేశం తీర్మానించింది. నరసింహారావుపాలెంలో మాజీ సర్పంచ్ గార్లపాటి మారేష్ గృహంలో శుక్రవారం మండల ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మొలుమాటి రవిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి తొమ్మండ్రు రుద్రయ్య, మండల నాయకులు కోట జోషి, కలపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

చాట్రాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం గ్రామ పరిధిలో లక్ష్మీపురం రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి ఏఎస్సై గజపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 8 మంది పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని, రూ 73,430 నగదు, బైక్‌లు 6, సెల్ ఫోన్లు 9 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.